### సాగర్ ఆయకట్టులో యాసంగికి క్రాఫ్ హాలీడే

- జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి
- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ 7




- ఏటా ఉమ్మడి జిల్లాలో రూ.5 కోట్ల విలువైన సీడ్ కొనుగోలు
- లెక్కల్లో గందరగోళం.. భారీగా నిధుల దుర్వినియోగం
- స్థానికంగా చేపపిల్లల ఉత్పత్తిని పట్టించుకోని మత్స్యశాఖ
- నిరుపయోగంగా స్థానిక కేంద్రాలు
- ఆంధ్రాలోని సీడ్ సెంటర్లపైనే ఆధారం
- పేరుకే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం



# చేప పిల్లల పేరిట చేతివాటం

**చెరువుల్లో చేపల పెంపకానికి ప్రభుత్వం సమకూరుస్తున్న సీడ్ (చేప పిల్లలు) వెనుక అవినీతి చీడ ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. స్థానికంగా చేప పిల్లలను ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నప్పటికీ, ఆ దిశగా కార్యాచరణ చేపట్టని అధికారులు-ఆంధ్రా నుంచి సీడ్‌ను తెప్పించడంలో మాత్రం తెగ ఉత్సాహం చూపుతున్నారు. తెచ్చే చేప పిల్లలు ఎన్ని..? చెరువులోకి వదిలేవి ఎన్ని..? అనే లెక్కలకు సంబంధించి అనేకానేక అనుమానాలున్నాయి. ఏటా ఉమ్మడి జిల్లాలో రూ.5 కోట్ల విలువైన సీడ్ కొనుగోలు చేస్తుండగా, ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నట్టు ఆరోపణలున్నాయి. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్య సంపదను వృద్ధి చేసే అవకాశాలు ఉన్నా.. ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడం చేపల పెంపకానికి శాపంగా మారింది.**

ఖమ్మం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో పాలేరు, వైరా, లంకాసాగర్, బేతుపల్లి, కిన్నెరసాని, తాలిపేరు వంటి మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులతో పాటు సుమారు 2వేల చెరువులు ఉన్నాయి. కానీ మత్స్యశాఖ తరుపున చేపల ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన సీడ్ ఉత్పత్తి చేయడం లేదు. యువ రైతులను ఆ దిశగా ప్రోత్సహించడం లేదు. ప్రతీఏటా టెండర్లు వేయడం, ఆంధ్రానుంచి చేపపిల్లలు తెచ్చి ప్రాజెక్టులు, చెరువుల్లో వదలడం పెద్ద వ్యాపారంగా సాగుతోంది. ఏటా ఉమ్మడి జిల్లాలో ఇందుకోసం రూ.5కోట్ల మేర నిధులు ఖర్చవుతున్నాయి. వాస్తవానికి ఏపీలో మత్స్యశాఖతోపాటు చెరువులు, ప్రాజెక్టుల సమీపంలో ఉన్న యువరైతులకు శిక్షణ ఇచ్చి చేపపిల్లల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు.

అక్కడి నుంచే తెలంగాణలోని పలు జిల్లాలకు చేపపిల్లలు సరఫరా అవుతున్నాయి. ఇక్కడి అధికారులు ఇష్టానుసారంగా టెండర్లు వేయడంతో తెచ్చే పిల్లలకు పోసే పిల్లలకు లెక్క కుదరడంలేదు. లక్ష చేపపిల్లలు వస్తే అందులో 50 నుంచి 60వేల వరకే ఉంటుండగా మిగిలినవి చనిపోతున్నాయి. అయితే బతికున్నవాటికే డబ్బులు ఇస్తామని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నా.. దీనిపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడుతోంది.

కొన్ని సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు చేపపిల్లలను లెక్కించకుండానే చెరువుల్లో వదులుతున్నారు. చేప పిల్లల్ని తీసుకొచ్చే కాంట్రాక్టర్లు కొన్ని మత్స్యసొసైటీలను మచ్చిక చేసుకుని ఇష్టానుసారంగా చేప పిల్లలను వదులుతున్నారు. దీంతో ప్రతి ఏటా చెరువుల్లో పోసే చేప పిల్లలకు, ఉత్పత్తి అయ్యే చేపలకు పొంతన కుదరడంలేదు.

ఏటా వానాకాలం సీజన్‌లో టెండర్లు నిర్వహించిన రెండు రకాల చేప పిల్లలను తీసుకొస్తుంటారు. నెలరోజుల వయస్సున్న చేపపిల్లకు రూ.0.55 పైసల నుంచి రూ.0.75 పైసలు, రెండు నెలలపైన వయసున్న చేప పిల్లకు రూ.1 నుంచి రూ.2 చెల్లిస్తున్నారు. నిధులు ఖర్చు చేయడమే తప్ప జిల్లాలోనే చేపపిల్లల ఉత్పత్తికి మత్స్యశాఖ కార్యాచరణ సిద్ధం చేయడం లేదు. వాస్తవానికి మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పాలేరు, వైరా, కిన్నెరసాని తదితర చోట్ల చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలున్నా అవి పనిచేయడంలేదు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో పరికరాలు శిథిలావస్థకు చేరాయి.

**పేరుకే పీఎంఎంఎస్‌వై పథకం**

మత్స్యసంపద అభివృద్ధికోసం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. అయితే ఈ పథకం కింద జిల్లాలో మత్స్యశాఖ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడంలేదు. ఈ పథకం కింద యూనిట్‌కు సుమారు రూ.11లక్షలు ఒక్కో లబ్ధిదారుడికి మంజూరవుతాయి. ఎస్సీ, ఎస్టీలకు, మహిళలకు 60శాతం సబ్సిడీ ఉండగా, మిగిలినవారికి 40శాతం సబ్సిడీ లభిస్తుంది. చేపల ఉత్పత్తికి, పెంపకానికి అవసరమైన కుంటలను చిన్నచెరువులను తవ్వడం, తల్లి, పిల్ల చేపలను కొనుగోలు చేయడం, చేపపిల్లలు, గుడ్ల ఉత్పత్తికి, పెంపకానికి అవసరమైన సౌకర్యాలు, పరికరాలు కొనుగోలు చేసే అవకాశం ఈ పథకంలో ఉంది. భూమి, నీటి సౌకర్యం ఉన్న యువరైతులకు శిక్షణ కల్పించి చేపల పెంపకంతోపాటు చేపగుడ్ల ఉత్పత్తిపైనా శిక్షణ ఇచ్చి జిల్లాలోనే చేప పిల్లల ఉత్పత్తికి, చేపల పెంపకానికి ప్రోత్సాహం కల్పించాలి. కానీ జిల్లాలో ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదు.

### పీఎంఎంఎస్‌వై కింద ప్రణాళిక సిద్ధం చేశాం

**ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి**



జిల్లాలో మత్స్య అభివృద్ధి పథకం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎంఎంఎస్‌వై కింద ప్రణాళిక సిద్ధం చేశాం యూనిట్లు మంజూరుకావాల్సి ఉంది. ఏపీలోని ఆకివీడు, భీమవరం తదితర ప్రాంతాలనుంచి కొనుగోలు చేసిన చేపపిల్లల్లో కొన్ని చనిపోతున్న మాట వాస్తవమే. అయితే లెక్కలు చూపించి బతికిన వాటికే డబ్బులు చెల్లిస్తున్నాం. జిల్లాలో చేప పిల్లల ఉత్పత్తికి ఔత్సాహికులు ఎవరూ ముందుకు రావడంలేదు. ఎవరైనా ముందుకు వస్తే అన్ని విధాల శిక్షణ ఇచ్చి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం.

# వద్దిరాజుకు మరోసారి..



- బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా నేడు నామినేషన్

ఖమ్మం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా ఖమ్మానికి చెందిన వద్దిరాజు రవిచంద్ర (గాయత్రి రవి) పేరును ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఖరారు చేశారు. ఇప్పటికే రెండేళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై ఆ పదవిలో కొనసాగుతున్న వద్దిరాజు రవిచంద్ర పదవీ కాలం త్వరలో ముగియనుండగా మళ్లీ ఆయనకు రాజ్యసభ టిక్కెట్ ఖరారు చేశారు. గురువారం ఆయన నామినేషన్ వేయబోతున్నారు. మున్నూరు కాపు(బీసీ) సామాజిక వర్గానికి చెందిన రవిచంద్ర గ్రానైట్‌రంగంలో గాయత్రి గ్రూప్ వ్యవస్థాపక ఛైర్మన్‌గా, తెలంగాణ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అధ్యక్షుడిగా పని చేశారు. మొదట్లో గ్రానైట్‌రంగంలో రాణించిన వద్దిరాజు 2018 అసెంబ్లీఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. 2019లో టీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి రాజ్యసభ సభ్యుడు బండ ప్రకాష్ లోక్‌సభకు ఎన్నిక కావటంతో ఇంకా రెండేళ్ల గడువున్న ఆ స్థానానికి 2002 మే 23న ఉప ఎన్నిక నిర్వహించగా వద్దిరాజు రవిచంద్రకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవకాశం ఇచ్చారు. ఈ రెండేళ్లలో పార్టీ అధినేతలకు మరింత దగ్గర కావడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో కేసీఆర్ మరోసారి ఆయనకు పెద్దల సభకు అవకాశం ఇచ్చారు.

**పార్టీకోసం, ప్రజలకోసం కష్టపడి పనిచేస్తా వద్దిరాజు రవిచంద్ర**

రెండోసారి రాజ్యసభ సీటుకు ఎంపికైన తాను బీఆర్ఎస్ పార్టీకోసం, ప్రజలకోసం కష్టపడి పనిచేస్తానని వద్దిరాజు రవిచంద్ర 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కేసీఆర్ ఆశీస్సులతో రాజ్యసభకు ఎంపికకావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. క్లిష్ట సమయంలో పార్టీ ఇచ్చిన అవకాశంతో కేసీఆర్‌కు అండగా ఉంటూ పార్టీ కోసం పని చేస్తానన్నారు. రాష్ట్ర సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

**వద్దిరాజు రవిచంద్ర నేపథ్యం**

**పుట్టిన తేదీ:** 1964మార్చి 22
**జన్మస్థలం:** ఇనుగుర్తి గ్రామం, కేసముద్రం మండలం, మహబూబాద్‌జిల్లా
**విద్యార్హత:** బీకాం
**నివాసం:** ఖమ్మం, వరంగల్, హైదరాబాద్
**తల్లిదండ్రులు:** కీ.శే.వద్దిరాజు నారాయణ, వెంకటనర్సమ్మ

**కుటుంబ వివరాలు**

**భార్య:** వద్దిరాజు విజయలక్ష్మి
**కూతురు, అల్లుడు:** గంగుల గంగాభవాని, సందీప్
**కుమారుడు-కోడలు:** వద్దిరాజు నికిల్‌సాయి చంద్ర, అనిల
**వృత్తి:** గ్రానైట్‌వ్యాపారం
**సంస్థ:** గాయంత్రి గ్రానైట్ గ్రూప్ కంపెనీస్, ఖమ్మం, వరంగల్-మేనేజింగ్ డైరెక్టర్

# అనుభవానికి దక్కిన అవకాశం



- రాజ్యసభకు కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకాచౌదరి
- పెద్దల సభకు నేడు నామినేషన్
- జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

ఖమ్మం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందిన కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత గారపాటి రేణుకాచౌదరి మరోసారి రాష్ట్రం నుంచి పెద్దలసభ(రాజ్యసభ)కు వెళ్లబోతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంనుంచి అవకాశం ఉన్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానానికి రేణుకాచౌదరి పేరును ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. దాంతో గురువారం ఆమె తన నామినేషన్ దాఖలు చేయబోతున్నారు. సోనియాగాంధీ కుటుంబంతో పాటు కాంగ్రెస్ పార్టీ పట్ల ఉన్న విధేయత, పార్లమెంట్ ఉభయసభల్లో ఉన్న సుదీర్ఘ అనుభవం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రేణుకా చౌదరికి రాజ్యసభలో అవకాశం కల్పించింది. దీనికితోడు టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర రాజకీయాల్లో మొదటి నుంచి అండగా నిలవడం కూడా ఆమెకు కలిసి వచ్చింది. ఎన్టీఆర్ పిలుపు మేరకు టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన రేణుకాచౌదరి అంచలంచెలుగా ఎదిగి పలుమార్లు రాజ్యసభకు, లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు దేవేగౌడ, మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో కేంద్రమంత్రిగా పనిచేశారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి పదవి కోల్పోయినప్పుడు ఓ గృహిణిగా ఉన్న రేణుకాచౌదరి ఆయనకు మద్దతుగా హైదరాబాదులో ఆందోళనలో పాల్గొని ఎన్టీఆర్ దృష్టిని ఆకర్షించారు. ఆమె రాజకీయ ఉత్సాహాన్ని చూసిన ఎన్టీఆర్ టీడీపీ నుంచి హైదరాబాదు మునిసిపాలిటీలో కార్పొరేటర్‌గా అవకాశం ఇచ్చారు. తొలిసారి 1986లో రాజ్యసభకు ఎంపికయ్యారు. దేవేగౌడ ప్రభుత్వంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి 1999, 2004లో ఖమ్మం ఎంపీగా ఎన్నికయ్యారు. మన్మోహనసింగ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. చివరిగా 2019లో ఖమ్మం లోక్‌సభకు పోటీచేసి ఓటమిపాలయ్యారు. తాజాగా రాజ్యసభకు రేణుకాచౌదరిని ఎంపిక చేయడంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు.

**రేణుకకు మంత్రి తుమ్మల అభినందనలు**

రాజ్యసభకు రేణుకాచౌదరి పేరు ఖారారు కావటంతో హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో సందడి నెలకొంది. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రేణుకా చౌదరిని కలిసి అభినందనలు తెలిపారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రేణుకాచౌదరికి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి అభినందించారు. ప్రజాసమస్యలను రాజ్యసభలో ప్రస్తావించే అవకాశం పార్టీ కల్పించినందుకు మంత్రి తుమ్మల కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. రేణుకాచౌదరి తనకున్న అనుభవంతో రాజ్యసభలో మరింత ప్రతిష్ఠ పెంచాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

**రాష్ట్ర అభివృద్ధికోసం కృషిచేస్తా కేంద్రమాజీ మంత్రి రేణుకా చౌదరి**

రాజ్యసభ సభ్యురాలుగా రాష్ట్రంనుంచి అవకాశం కల్పించినందుకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌కార్గే, పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిలకు రేణుకాచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశం ద్వారా రాష్ట్ర అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. భద్రాద్రి రామయ్య ఆశీస్సులతో ఖమ్మం జిల్లా ఆడబిడ్డగా తనకు అవకాశం లభించిందన్నారు. గురువారం నామినేషన్ కార్యక్రమానికి జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని కోరారు.



రేణుకను అభినందిస్తున్న తుమ్మల

**రేణుకాచౌదరి బయోడేటా**

**పేరు:** గారపాటి రేణుకాచౌదరి
**తల్లిదండ్రులు:** కనుమిల్లి సూర్యనారాయణరావు (ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్), వసుంధరరావు
**పుట్టిన తేదీ:** 1954 ఆగస్టు 13, విశాఖపట్నం
**భర్త:** శ్రీధర్‌చౌదరి,వ్యాపారవేత్త
**సంతానం:** ఇద్దరు కుమార్తెలు (పూజిత చౌదరి, తేజస్విని చౌదరి)
**విద్యార్హత:** పోస్టుగ్రాడ్యుయేషన్ (మాస్టర్ ఆఫ్ ఇండస్ట్రీయల్ ఫిజియాలజీ) కర్ణాటక యూనివర్సిటీ బెంగళూరు, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్ కుమార్తె కావడంతో దేశంలోని ఉత్తరాఖండ్, డెహరాడూన్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో విద్యాభ్యాసం.



భద్రాచలంలో భక్తరామదాసు కీర్తనలను ఆలపిస్తున్న బృందం

# దొరకునా ఇటువంటి సేవ..

- భద్రాద్రిలో ఆకట్టుకున్న భక్తి సంగీత కార్యక్రమాలు
- మూడో రోజు కొనసాగిన భక్తరామదాసు వాగ్గేయకారోత్సవాలు
- నేలకొండపల్లిలో ముగిసిన జయంత్యుత్సవాలు

భద్రాచలం/ నేలకొండపల్లి, ఫిబ్రవరి 14: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భక్తరామదాసు 391వ జయంతి ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం నిర్వహించిన సంగీత కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎన్.శామకుర్తి శర్మ వయోలిన్, కుమ్ఇషాకు చెందిన త్రిష భక్తి సంగీతం, ఎన్.కృష్ణమోహన్, వి.శ్రీలక్ష్మి, కపిలవాయి లలిత విజయకుమార్ ఆలపించిన భక్తరామదాసు కీర్తనలు శ్రోతలను అలరించాయి. బెంగళూరుకు చెందిన సాయి దీక్షిత్, హైదరాబాద్‌కు చెందిన ఉమ్మడి అనురాధ, శివకృష్ణ స్వరూప్, దూళిపాల వంశీ, ఖమ్మానికి చెందిన దుర్గా సైదులు నాదస్వర బృందం, హైదరాబాద్‌కు చెందిన నీటా చంద్రశేఖర్, జొన్నలగడ్డ శ్రీరామ్ బృందం, ఆలపించిన భక్తరామదాసు కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తరామదాసు జన్మస్థలం ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యానమందిరంలో మూడు రోజుల నుంచీ జరుగుతున్న భక్తరామదాసు 391వ జయంత్యుత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. సంగీత కార్యక్రమాలు, విష్ణు సహస్రనామ పారాయణం ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం నుంచి రామదాసు కీర్తనల గానం, వీణావాదన కచేరీ, సంగీత, నృత్య కార్యక్రమాలతో జయంత్యుత్సవాలు ముగిశాయి.


### ప్రత్యేక నిధులపై గుబులు

- నగరంలో అప్పటి పనులు చేయొద్దంటున్న అధికారులు
- సర్కారు అనుమతించాకే మొదలుపెట్టాలంటూ సూచన
- ఆర్థిక ఇబ్బందులపై మంత్రి తుమ్మలను కలిసిన కాంట్రాక్టర్లు


7

### వ్యవసాయ మార్కెట్‌కు సిబ్బంది కొరత

- ఖమ్మం మార్కెట్‌కు ఏటా పెరుగుతున్న ఉత్పత్తుల రాక
- 49 మంది సిబ్బందికి.. 19మందితోనే పని


# మల్లు వెంకటేశ్వర్లుకు కన్నీటి వీడ్కోలు

- సోదరుడి పాడె మోసిన భట్టి విక్రమార్క, మల్లు రవి




నివాళులర్పిస్తున్న భట్టి విక్రమార్క, నందిని, మల్లు రవి, కుటుంబసభ్యులు, ఖమ్మం కలెక్టర్ గౌతమ్

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పెద్ద సోదరుడు, విశ్రాంత ఆయూష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో అశ్రునయనాల మధ్య నిర్వహించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి తమ సోదరుడి పాడె మోసి నివాళులర్పించారు. ముందుగా వైరాలో డాక్టర్ వెంకటేశ్వర్లు భౌతికకాయనికి అంత్యక్రియల ముందు నిర్వహించే తతంగాన్ని పూర్తిచేసి భౌతికకాయాన్ని అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శన తరువాత ఆయన వ్యవసాయ క్షేత్రానికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క, రవి తమ సోదరుడి పాడె మోశారు. వైరా, స్నానాల లక్ష్మీపురం పరిసర గ్రామాలకు చెందిన వారు భారీ సంఖ్యలో అంతిమయాత్రలో పాల్గొన్నారు. డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించి ఆయన సోదరులు భట్టి విక్రమార్క, రవిని పరామర్శించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు లావుడ్యా రాములు నాయక్, కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మం కలెక్టర్ వీపీ.గౌతమ్, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి, కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాం నాయక్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఖమ్మం ఆర్డీవో గణేష్, నాయకులు రాయల నాగేశ్వరరావు, నలమల వెంకటేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, జావెద్, రామ్మోహన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, శీలం వెంకటనర్సిరెడ్డి, దొడ్డా పుల్లయ్య, ఏదునూరి సీతారాములు, బీడీకే.రత్నం, మచ్చా బుజ్జీ, నర్సింహారావు, కట్ల రంగారావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, సీపీఎం నాయకుడు బొంతు రాంబాబు తదితరులు నివాళులర్పించారు.

# పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

### 58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణ భవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

## సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్‌ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్‌ఎంసీ పరిధిలో తిష్టవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

### బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

## 'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

## రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

| యూనిట్ల వినియోగం | సోలార్ ప్లాంట్ | వ్యయం | కేంద్రం సబ్సిడీ | వినియోగదారుడు భరించాల్సింది |
|---|---|---|---|---|
| 0-100 | 1 కిలోవాట్ | రూ.60 వేలు | రూ.30 వేలు | రూ.30 వేలు |
| 150 | 2 కిలోవాట్లు | రూ.1.10 లక్షలు | రూ.60 వేలు | రూ.50 వేలు |
| 300 | 3 కిలోవాట్ | రూ.1.65 లక్షలు | రూ.78 వేలు | రూ. 87 వేలు |

### ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

### భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

## బీఆర్‌ఎస్‌కు షాక్

### కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్‌ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్‌ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

### ఢిల్లీ రైతు పోరాటంపై
## మోదీ నిరంకుశత్వం

● ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

వైరా, ఫిబ్రవరి 14: ఢిల్లీ రైతు పోరాటంపై మోదీ నిరంకుశతత్వ, అణచివేత కొనసాగిస్తున్నారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఈ అణచివేతను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. బుధవారం వైరాలో జరిగిన ఆపార్టీ సమావేశంలో రంగారావు మాట్లాడారు. హర్యానా, ఢిల్లీ రైతులు దేశ రైతుల కోసం పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో ధర్నా చేయటానికి వస్తుండగా మోదీ ప్రభుత్వం బారికేడ్లు, రబ్బర్ తూటాలు, లాఠీచార్జీలతో హింసకు గురిచేస్తుందని విమర్శించారు. దీన్ని దేశ ప్రజలు నిరసించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర అడగడం ఎలా నేరమవుతుందని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈనెల 16న అఖిలపక్షం ఆధ్వర్యంలో జరుగనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు సీవై.పుల్లయ్య, కె.అర్జున్‌రావు, జి.రామయ్య, ఆవుల అశోక్, రాయల రవికుమార్, యలదండి బాబు పాల్గొన్నారు.

### ముష్టిగింజల లభ్యతపై
## సమగ్ర సర్వే నిర్వహించాలి

- జీసీసీ డీఎం, మేనేజర్లకు ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 14: భద్రాచలం ఏజెన్సీలో ముష్టి గింజలు ఎక్కడెక్కడ పండుతున్నాయో సర్వే నిర్వహించి ప్రభుత్వానికి త్వరితిగతిన ప్రతిపాదనలు సమర్పించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ జీసీసీ డీఎం, మేనేజర్లను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో జీసీసీ సొసైటీ మేనేజర్లతో జీసీసీ బ్రాంచిలలోని సొసైటీల ద్వార సేకరిస్తున్న అటవీ ఫలాలు, ముష్టి గింజల సేకరణ, సర్వే ఆశ్రమ గృహాలకు జీసీసీ ద్వారా సరఫరా చేసే ఫుడ్ ప్రాసెసింగ్ అంశాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పీవో మాట్లాడుతూ జీసీసీ ద్వార ఐటీడీఏ పరిధిలో నిర్వహించే విద్యా సంస్థలకు మన్నికైన సామాన్లను పంపాలని, వాటికి సంబందించి ప్రతీది రిజిష్టర్లో నమోదు చేయాలని అన్నారు. గిరిజనులు అడవుల్లో సేకరించే అటవీ ఫలాలు మధ్య దళారులు దోచుకోకుండా జీసీసీకే విక్రయించేలా సంబంధిత మేనేజర్లు, జీసీసీ సిబ్బంది గిరిజనులకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే అటవీ ఫలాలు జీసీసీకి గిరిజనులు తరలించిన వెంటనే వారికి సంబంధించిన పైకం సకాలంలో అందజేయాలని ఆదేశించారు. ఆదివాసీల దగ్గర ముష్టి గింజలు తప్పకుండా సేకరించాలని, ప్రస్తుతం సొసైటీలలో నిల్వ ఉన్న ముష్టి గింజల వివరాలు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, జీసీసీ డీఎం వినయ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, జీసీసీ మేనేజర్లు దావీద్, లక్ష్మీజీ, లక్ష్మణ్, నరసింహారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

## 'నల్లవాగు' ఆనకట్ట అస్తవ్యస్తం

- కుంగిన కాలువ కట్టలు.. ఆక్రమణకు గురైన కాలువ

సత్తుపల్లి, ఫిబ్రవరి 14: సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2200ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే నల్లకాలువ మరమ్మత్తులకు నోచుకోక అస్తవ్యస్తంగా మారింది. సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి పెద్ద చెరువు ఆయకట్టులో రీజనరేటెడ్ నీరు వృథాగా పోకుండా బేతుపల్లి శివారులో నల్లవాగు బంధం ఆనకట్టను 1973-74లో నిర్మించారు. దీని నుంచి ఆరున్నర కిలోమీటర్ల పొడవున కాలువలను తవ్వారు. కాలువల ద్వారా మండలంలోని నారాయణపురం, కిష్టాపురంలలో 800ఎకరాలకు సాగునీరు అందుతుంది. అక్కడి నుంచి తుంబూరు పెద్ద చెరువులోకి నల్లకాలువ ద్వారా నీరు చేరుతుంది. తుంబూరు పెద్ద చెరువుకు ప్రధాన వనరు నల్లకాలువే. పెద్దచెరువు ఆయకట్టు 450 ఎకరాలుగా ఉంది. అక్కడి నుంచి వేంసూరు మండలంలో దుద్దేపూడి చెరువుకు నీళ్లు చేరి 450ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. నల్లకాలువ మిగులు నీరు భరణిపాడు కెనాల్‌కు మళ్లించడం ద్వారా మరో 500ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఆరున్నర కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్న నల్లకాలువ ఎడమ గట్టు మూడు మీటర్లు, కుడి గట్టు ఐదు మీటర్ల వెడల్పున ఉన్నాయి. అప్పటిలోనే రైతులు కాలువల నిర్మాణానికి భూమిని విరాళంగా ఇచ్చారు.

### అస్తవ్యస్తంగా ఆనకట్ట, కాలువలు

ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన నల్లవాగు బంధం ఆనకట్టు శిథిలావస్థలో ఉంది. దీనికి సంబంధించిన గోడ కూలిపోయి తూము కూడా పూడికతో నిండిపోయింది. కాలువలు పూడిక పేరుకుపోయి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కొన్నిచోట్లా కాలువ గట్లు కుంగిపోయి భారీవర్షాలు, వరదల సమయంలో గండ్లు పడుతున్నాయి. కొందరు రైతులు కాలువ గట్లను, కాలువలను సైతం ఆక్రమించుకుని తమ వ్యవసాయ భూముల్లో కలుపుకొన్నారు. మొత్తం నల్లవాగు బంధం ఆనకట్టు మరమ్మతులతోపాటు కాలువ, కాలువ గట్ల ఆక్రమణలు తొలగించి కాలువ గట్ల ఎత్తును పెంచి పూడిక తొలగిస్తే సాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఆ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థలో నల్లవాగు బంధం ఆనకట్ట

## ఉత్తమ విద్యుత్ వినియోగదారులకు ఖమ్మం ప్రత్యేకం

- విద్యుత్ నిర్దేశిత సేవలు ఉచితంగా అందుబాటులోకి
- గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 498కేసుల పరిష్కారం
- ఇంటి నుంచి వాట్సాప్ చేసిన ఫిర్యాదులు స్వీకరణ
- విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ చైర్మన్ తిరుమలరావు
- మంచుకొండలో సమస్యలపై ఫిర్యాదులు స్వీకరణ

రఘునాథపాలెం, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యుత్ వినియోగదారులు ఉత్తములని, బకాయిలు లేకుండా ప్రతీ నెల విద్యుత్ బిల్లులను చెల్లిస్తుంటారని ఎన్నో ఏళ్లుగా విద్యుత్‌శాఖ లెక్కలు ఇదే చెపుతున్నాయని టీఎస్ ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ చైర్మన్ తిరుమలరావు ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యుత్ వినియోగదారులకు కితాబునిచ్చారు. బుధవారం మంచుకొండలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించగా చైర్మన్ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2003 విద్యుత్ చట్టం మేరకు ఫోరమ్ ద్వారా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చేసేందుకు ఫోరమ్ ఏర్పాటు చేశారన్నారు. 2005 నుంచి ఫోరమ్ ఆధ్వర్యంలో కేసులు నమోదు చేసి పరిష్కారం చేశామన్నారు. వినియోగదారులు తమ సమస్యలు 94408 11299, 83339 23840, 94913 07004 నెంబర్లకు తమ ఫిర్యాదులను వాట్సాప్ చేసిన స్వీకరించి రసీదు పంపించి కేసులు నమోదు చేసి పరిష్కరిస్తామన్నారు. వరంగల్ ఫోరమ్ పరిదిలోని పది జిల్లాల్లో గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 498 కేసులు నమోదు చేసి పరిష్కరించామన్నారు. ఈమెయిల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం చేశామన్నారు. ప్రతి వినియోగదారులు ఇంటి నుంచి ఫిర్యాదులు చేయవచ్చన్నారు. కోర్టు పరిదిలో ఉన్న కేసులు మాత్రం ఫోరమ్ తీసుకోదన్నారు. నూతన మీటర్లు ఏర్పాటు, లూజ్ లైన్లు, అధిక విద్యుత్ లోడ్‌పై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వినియోగదారులను నిర్లక్ష్యం చేసి సేవలను అందించని అధికారులకు రూ.1,53,000 జరిమాన విదించామన్నారు. వినియోగదారులకు సమస్యలు రాకుండా విద్యుత్ ఉద్యోగులు పనిచేయాలని ఆదేశించామన్నారు. ఫోరమ్ జడ్జిమెంట్‌కు సంతృప్తి చెందని వినియోగదారులు అంబుడ్స్‌మేన్‌కు వెళ్లొచ్చని తెలిపారు. ఫోరమ్ సభ్యులు నరేందర్, చందన్‌దాస్ ఫిర్యాదులు స్వీకరించారు. విద్యుత్‌శాఖ డీఈలు బాబురావు, రామారావు, ఏడీఈ సంజయ్‌కుమార్, ఏఈలు సతీష్, ఇందిరా, భాస్కర్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఫోరమ్ చైర్మన్

### టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 14: టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం రఘునాథపాలేనికి చెందిన వీరునాయక్ (20) అనే యువకుడు హమాలీగా విధుల నిర్వహిస్తున్నర్నారు. బుధవారం పనులకోసం రఘునాథపాలెం నుంచి ఖమ్మం వస్తుండగా బల్లేపల్లి సమీపంలో ఓ కంకర టిప్పర్ ఢీకొని మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని అనర్సం శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు.

### పాలకవర్గాలను కీర్తించే విష సంస్కృతిని
## కళాకారులు మానుకోవాలి

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 14: కళాకారులు పాలకవర్గాలను కీర్తించే విష సంస్కృతిని మానుకొని శ్రమ జీవుల్ని గౌరవిస్తూ ప్రజా కళలను సాహిత్యాన్ని అభివృద్ధి చేయాలని అరుణోదయ రాష్ట్ర ఇన్‌చార్జ్ కే రమ పిలుపునిచ్చారు. రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర సమావేశంలో ఆమె మాట్లాడారు. కష్ట జీవుల కోసం కళాకారులు పాటలు రాసి గజ్జ కట్టి ఆటలాడాలని హితవు పలికారు. రామమందిరం పేరుతో మరోసారి బీజేపీ ప్రభుత్వం రావాలని ప్రజల్లోకి మతోన్మాదాన్ని పెంపొందిస్తుందన్నారు. 16 సార్వత్రిక సమ్మెలో కళాకారులు ముందు వరసలో నిలవాలని పిలుపునిచ్చారు. అజ్మీరా బిచ్చా అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, నాయకులు చంద్రన్న, లక్ష్మణ్, బుర్ర రాఘవులు, ప్రసాద్, రాంబాబు, అంజి పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 14: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో ఓ కౌలు రైతు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, మంగళగూడెం గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా, డోర్నకల్ మండలం, రాముతండా పంచాయతీ పరిదిలోని లకావత్‌తండా గ్రామానికి చెందిన సోమ్లా (59) మంగళగూడెంలో ఓ రైతు నుంచి చేను కౌలుకుతీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. చేలో ఉన్న మోటార్ కోసం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చేలో ఉన్న ఫెన్సింగ్ తీగల మీదుగా సర్వీర్ వైర్ లాగి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. విద్యుత్ తీగ మరమ్మతులకు గురై ఫెన్సింగ్ తీగలకు తగిలి విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో సోమ్లా ఫెన్సింగ్ తీగలను పట్టుకోవడంతోషాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు పోలీసుకు ఫిర్యాదు చేశారు.

## మల్లెల లింగమ్మకు ప్రముఖుల నివాళి





లింగమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కుటుంబసభ్యులు డాక్టర్ ఎంవీరావు, తదితరులు

కారేపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని కొత్తకమలాపురం గ్రామానికి చెందిన యశోద ఆసుపత్రి ప్రముఖ వైద్యులు మల్లెల వెంకటేశ్వరరావు (ఎంవీరావు) మాతృమూర్తి మల్లెల లింగమ్మ దశదినకర్మలకు పలువురు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. బుధవారం మండలంలోని కొత్తకమలాపురం గ్రామంలో వారి స్వగ్రామం ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు పరిసర ప్రాంతాలనుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. లింగమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, నల్లమోతు భాస్కరరావు, రాష్ట్ర కాంగ్రెస్ మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, హైదరాబాదుకు చెందిన ప్రముఖ వైద్యులు హాజరయ్యారు. లింగమ్మ కుమారులు సైదయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరావులను పరామర్శించారు.

## దేవస్థానం నిత్యాన్నదాన సత్రానికి వంట సామగ్రి అందజేత

భద్రాచలం, ఫిబ్రవరి 14: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం నిత్యన్నదాన సత్రంకు హైదరాబాద్‌కు చెందిన ఎల్‌వీఎస్ మురళీధర్‌రావు-నాగమణి, ఆకెళ్ల నరసింహం- నమిత వారి కుటుంబ సభ్యులు రూ.1,85,000 విలువైన వంట సామగ్రిని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి సమక్షంలో అందజేశారు. ముందుగా దాతలు ఆలయంలో స్వామి వారికి జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అనంతరం నిత్యన్నదాన సత్రంలో వంట సామగ్రిని ఈవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, దేవస్థానం పర్యవేక్షకులు నిరంజన్‌కుమార్, సిబ్బంది రాకేష్ పాల్గొన్నారు.



వంట సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

# ప్రత్యేక నిధులపై గుబులు



ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్

- ఖమ్మం కార్పొరేషన్‌లో రూ.22కోట్ల బిల్లులు పెండింగ్
- గత ప్రభుత్వ హయాంలో మంజూరు
- అప్పటి పనులు చేయొద్దంటున్న అధికారులు
- సర్కారు అనుమతించాకే మొదలుపెట్టాలని సూచన
- ఆర్థిక ఇబ్బందులపై మంత్రి తుమ్మలను కలిసిన కాంట్రాక్టర్లు

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి14: ఖమ్మం నగరపాలక సంస్థకు ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) రూ.50 కోట్లు ఇస్తున్నట్లు బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. దీంతో నగరంలోని డివిజన్లలో సీసీ డ్రెయిన్లు నిర్మించారు. అయితే బీఆర్ఎస్ అధికారం కోల్పోవటంతో ఎస్‌డీఎఫ్ నిధులు వస్తాయా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇంతవరకు రూ.22కోట్లతో పనులు జరగగా, కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదు. అంతేకాకుండా మిగిలిన రూ.28కోట్ల పనులు చేయవద్దని అధికారులు ఆదేశించడంతో చేసిన పనులకు బిల్లులు వస్తాయా.. రావా.. అని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుత ప్రభుత్వం పాత ప్రభుత్వంలో మంజూరైన పనులను చేయవద్దని చెప్పటంతో నగరపాలకసంస్థకు చెందిన కాంట్రాక్టర్ల పరిస్థితి అయోమయంగా మారింది.

**రూ.50కోట్లతో 60పనులకు ప్రణాళిక..**

ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50కోట్లతో 60పనులు చేయాలని ప్రణాళిక తయారుచేశారు. దానిలో భాగంగా డివిజన్లలో కేవలం సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఒక్కో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.60లక్షలనుంచి రూ.90లక్షల వరకు కేటాయించారు. నగరపాలకసంస్థ పరిధిలోని 24 డివిజన్లలో రూ.22.60కోట్లతో నిర్మాణాలు పూర్తిచేశారు. అయితే ఒక్క పైసా కూడా బిల్లు రాకపోవటంతో అప్పులు తెచ్చి పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు.

**బలవంతంగా పనులు అప్పగించి..**

ఎస్‌డీఎఫ్ నిధులలతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో వారిని పిలిపించి బలవంతంగా పనులు అంటగట్టారు. సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు కాంట్రాక్టర్లు ఎవరూ టెండర్లు దాఖలు చేయకపోవటంతో వారిని నగరపాలక సంస్థ కార్యాలయానికి పిలిపించి, కార్పొరేటర్లు సూచించినవారికి పనులు అంటగట్టారు. నిధులు వస్తాయని నచ్చజెప్పారు. మొత్తానికి నిర్మాణ పనులు చేయించి ఆరునెలలు గడిచినా, ఇంతవరకు బిల్లులు రాలేదు.

**పనుల వివరాలను కలెక్టర్‌కు పంపించాం**
**నగరపాలకసంస్థ ఈఈ కృష్ణాలాల్**

ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల వివరాలను కలెక్టర్‌కు పంపించినట్లు నగరపాలకసంస్థ ఈఈ కృష్ణాలాల్ తెలిపారు. ఎక్కడ ఏయే పనులు చేశారో, రావలసిన బిల్లుల వివరాలను సమగ్రంగా కలెక్టర్‌కు అందచేశామన్నారు. త్వరలోనే బిల్లులు వస్తాయన్నారు. మిగిలిన పనులను ప్రభుత్వం అనుమతించిన తరువాతే చేపడతామని పేర్కొన్నారు.



మంత్రి తుమ్మలతో కాంట్రాక్టర్లు

**మంత్రి తుమ్మలను కలిసిన కాంట్రాక్టర్లు**

ఎస్‌డీఎఫ్ బిల్లులు పెండింగ్‌లో పడిన నేపథ్యంలో నగరపాలకసంస్థ కాంట్రాక్టర్లు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. సదరు నిధులతో నగరంలో పనులు చేశామని, ఆరునెలలు గడిచినా బిల్లులు రాలేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి వివరించారు. అందుకు స్పందించిన మంత్రి తుమ్మల ఎంబీ రికార్డులతో సహా చేసిన పనుల వివరాలు, అందుకు అయిన వ్యయం జిల్లాకలెక్టర్‌కు నగరపాలకసంస్థ అధికారుల ద్వారా పంపించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

## ప్రజా సేవే పోలీసుల ప్రథమ కర్తవ్యం

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- చాతకొండ 6వ బెటాలియన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

కొత్తగూడెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. చాతకొండ 6వ బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన 5కి.మీ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, 3 బ్యారక్‌లను వర్చ్యువల్‌గా టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా ప్రారంభించారు. అనంతరం స్థానికంగా రిబ్బన్ కట్ చేసిన ఎస్పీ రోహిత్‌రాజు, బెటాలియన్ సిబ్బంది వసతి గదులను పరిశీలించారు. అనంతరం బెటాలియన్ ఆవరణంలో మొక్కలు నాటారు. పోలీసులు నిరంతరం విధుల్లో ఉంటూ ప్రజా సేవకే ప్రాముఖ్యత ఇస్తారని అన్నారు. వారి సంక్షేమం, ఆరోగ్యం కోసం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లా పోలీస్ శాఖ తరపు నుంచి బెటాలియన్‌కు ఎలాంటి అవసరాలు కావాలన్నా తనవంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ శివ ప్రసాద్, అదనపు కమాండెంట్ అంజయ్య

**రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జనవరి 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1,355, రోడ్డు ప్రమాదాలకు 2,922 వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. మొత్తం 40,915 ఈ చలాన్ కేసుల్లో రూ.80,78,385 జరిమానా విధించినట్లు తెలిపారు.

## మిర్చి తూకంలో హైటెక్ దగా

- రిమోట్‌తో కాటాను నియంత్రిస్తున్న వ్యాపారులు
- దేహశుద్ధి చేసిన రైతులు



వ్యాపారులను చుట్టుముట్టిన రైతులు.

చంద్రుగొండ, ఫిబ్రవరి 14: మిర్చి తూకాన్ని రిమోట్‌తో నియంత్రిస్తూ హైటెక్ దగా చేస్తున్న ఇద్దరు వ్యాపారులకు రైతులు దేహశుద్ధి చేసిన ఘటన బుధవారం సాయింత్రం మండలంలో బెండాలపాడులో చోటు చేసుకుంది. తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన మిర్చి వ్యాపారులు గుడిపల్లి రాంబాబు, ఎస్కే దస్తగిరి కలిసి నాలుగు రోజులుగా బెండాలపాడు, బాలికుంట గ్రామాల్లో క్వింటాకు రూ.19 వేలకుపైగా చెల్లించి రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో మిర్చి విక్రయించిన ఇద్దరు రైతులకు వ్యాపారులు నిర్వహిచే తూకంపై అనుమానం వచ్చింది. ఈ విషయం బోడా బాలు మరో రైతుతో మాట్లాడి గుమ్మనంగా ఉన్నారు. రోజులాగానే వ్యాపారులు వారి హమాలీలతో వచ్చి తేజావత్ రమేష్ మిర్చిని తూకం వేసి, రెండు ట్రాలీ ఆటోల్లో లోడ్ చేశారు. 25.53 క్వింటాళ్లు అయినట్లు రైతుకు రసీదు ఇచ్చారు. ఆవెనువెంటనే రైతులు రమేష్, బాలు కలిసి ఆటోలను వే బ్రిడ్జి వద్దకు మిర్చి ట్రాలీలను తరలించి తూకం వేయించారు. ఈ తూకంలో 31.10 క్వింటాళ్ల మిర్చి ఉన్నట్లు తేలింది. 5 క్వింటాళ్లకు పైగా అధికంగా ఉండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో ట్రాలీ డ్రైవర్లు, హమాలీలు పారిపోగా వ్యాపారులను పట్టుకొని ట్రాలీలతో సహా గ్రామానికి తరలించారు. విషయం తెలిసిన పోలీసులు రంగ ప్రవేశం చేసి వివరాలు తెలుసుకుంటున్నారు.

**నాలుగు రోజుల్లో రూ.4 లక్షల విలువైన మిర్చి దోపిడీ**

నాలుగు రోజులుగా తొమ్మిది మంది రైతుల నుంచి 70 క్వింటాళ్ల మిర్చిని కొనుగోలు చేసిన వ్యాపారులు రూ.4 లక్షల విలువైన మిర్చిని తరలించినట్లు రైతులు రమేష్, తిరుపతిరావు, రాజేష్, శ్రీను తదితరులు తెలిపారు. వ్యాపారులకు రైతులకు దళారిగా రావికంపాడు గ్రామానికి చెందిన పిచ్చయ్య అనే వ్యక్తి పనిచేస్తున్నట్లు తెలిపారు.

## 17న నైతికత, మానవ విలువల పరీక్ష

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 14: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన నైతికత, మానవ విలువల పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు తెలిపారు. గతంలో ఈ పరీక్షకు హాజరుకాని విద్యార్థులు కూడా హాజరై పరీక్ష రాయాలని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19న నిర్వహించే పర్యావరణ విద్య పరీక్షకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు తప్పక హాజరుకావాలని తెలిపారు. ఈ నెల 16న నిర్వహించే ఆంగ్ల ప్రయోగ పరీక్షకు మెత్తం 131 కళాశాలల నుంచి మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 16,006 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,462 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఇప్పటికే మూడు దశల్లో జరిగిన ప్రయోగ పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు నాల్గో దశలో జరిగే పరీక్షకు హాజరుకావాలని తెలిపారు.

## ఏపీ ఇసుక లారీల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన లారీలు

బూర్గంపాడు, ఫిబ్రవరి 14: ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని పలు పట్టణాలకు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీలను టీఎస్ఎండీసీ అధికారులు పట్టుకున్నారు. ఏపీ నుంచి బూర్గంపాడు మండలం మీదుగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో మంగళవారం రాత్రి సమయంలో ఆదికారులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో సారపాక నుంచి మోరంపల్లిబంజర వైపునకు వెళ్లే జాతీయరహదారి వెంబడి 17 ఇసుక లోడుతో ఉన్న లారీలను డ్రైవర్లు నిలిపిఉంచి తాళాలు వేసుకుని పరారయినట్లు సమాచారం. ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరగా టీఎస్ఎండీసీ అధికారులు లారీలను పట్టుకుని భద్రత కోసం పోలీసులకు అప్పగించారని తెలిపారు. జాతీయరహదారి వెంబడి నిలిపి ఉంచిన లారీలపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఉండడం మండలంలో తీవ్ర చర్చనీయంశంగా మారింది.

## సకాలంలో పనులు పూర్తి చేయాలి

- ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 14: ప్రధాన మంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన కింద, ఐటీడీఏ నిధులతో చేపట్టే అంగన్‌వాడీ సెంటర్లు, జీపీఎస్ పాఠశాలలను గిరిజన గ్రామాల్లో వసతులు కల్పించడానికి విడుదలైన నిధులను డీఈలు సక్రమంగా వినియోగించి సకాలంలో పూర్తి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డీఈలు, ఏఈలు, సీడీపీవోలు, ఏటీడీవోలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

## ఈవీఎంల పనితీరు పరిశీలన

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 14: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాములో మాక్ పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం తనిఖీ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్నిచర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి దశ తనిఖీ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మొదటి దశ తనిఖీ అనంతరం ఈవీఎంల పనితీరు పరిశీలనకు మాక్ పోల్ నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, సూపరింటెండెంట్ మదన్ గోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు దూరంగా ఉండాలి

- సింగరేణి సీఎండీ బలరాం



కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 14: దేశవ్యాప్తంగా ఈనెల 16న జరిగే సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని సింగరేణి సీఎండీ బలరాం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికులు భాగస్వాములు కావాలని, సార్వత్రిక సమ్మెకు సింగరేణికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఈ సమ్మె చేయడం వల్ల సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగితే రూ.85కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదముందని, కార్మికులు రూ.18కోట్లు వేతనాల రూపంలో కోల్పోయే అవకాశముందని తెలిపారు ఒకరోజు సమ్మె వల్ల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడకుండా కార్మికులంతా 16వతేదీన విధులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## గ్రాడ్యుయేట్ ఓటుహక్కు నమోదుకు గడువు పెంపు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 14: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు మార్చి 14 వరకు గడువు పెంచినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు వచ్చేందుకు మాత్రమే ఫిబ్రవరి 6 వరకు గడవని, ఫిబ్రవరి 24న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. మార్చి 14 వరకు నూతన ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అర్హులైన గ్రాడ్యుయేట్లు తమ దరఖాస్తులు అందించాలని కలెక్టర్ తెలిపారు. నవంబరు 1, 2020 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఉమ్మడి ఖమ్మం నల్గొండ వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్లంతా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు కావాలని కోరారు.

## గృహజ్యోతికి గడువు పొడిగింపు

- పట్టణంలో 70శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం ఆన్‌లైన్ నమోదు



ఆన్‌లైన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రకటించిన గృహజ్యోతి గడువు మరి కొద్ది రోజులు పాటు కొనసాగనుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొం టున్నారు. ప్రభుత్వ ప్రకటన మేరకు ఈనెల 15తోనే గడువు ముగియ నుంది. అయితే జిల్లాలో 50నుంచి 70శాతం మేరకు మాత్రమే క్యాటగిరి 1లోని 200యూనిట్ల లోపు విద్యుత్ వాడే వినియోగదారులకు మీటర్ నెంబర్లకు ఆధార్, మొబైల్ నెంబర్లు ఆన్‌లైన్ నమోదు జరిగింది. దీంతో విద్యుత్‌శాఖ పరంగా మరి కొద్ది రోజులు పాటు విద్యుత్ వినియోగదారుల నుంచి గృహజ్యోతి పథకానికి సిబ్బంది ఆధార్, మొబైల్ నెంబర్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగించనున్నారు.

**రేపటి నుంచి 18వరకు స్పెషల్ డ్రైవ్**

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 8లక్షల50వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందులో 200 యూనిట్ల లోపు వినియోగించే విద్యుత్ కనెక్షన్లు 5లక్షల 80వేలు ఉన్నాయి. కాగా ఇప్పటి వరకు 4,40,000 గృహ వినియోగదారుల మీటర్లను గృహజ్యోతి పథకంలో భాగంగా ఆధార్, మొబైల్, రేషన్‌కార్డు నెంబర్లను అనుసందానం చేశారు. ఇంకా లక్షా40 వేల విద్యుత్ మీటర్ల అనుసంధానం పెండింగ్‌లో ఉందని విద్యుత్ అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 90శాతానికి పైగా ఆన్‌లైన్ కార్యక్రమం పూర్తికాగా, పట్టణ ప్రాంతాల్లోనే విద్యుత్ మీటర్లకు ఆన్‌లైన్ జాప్యం జరుగుతుందని పేర్కొన్నారు.. అద్దె నివాసాల్లో ఉంటున్న వారికి గృహజ్యోతి పథకం అర్హత ఉంది. అయితే ఇంటి యజమానులు ఇందుకు అంగీకారం చెప్పకపోవడం పట్టణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ జాప్యానికి సమస్యగా మారింది. గృహజ్యోతి లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఈనెల 16నుంచి మరో మూడు రోజులు పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నూరుశాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఖమ్మం జిల్లా టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ బుధవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. 200 యూనిట్లు లోపు వినియోగించే విద్యుత్ వినియోగదారులు తమ ఆధార్, మొబైల్, రేషన్‌కార్డు వివరాలను స్థానిక విద్యుత్ సిబ్బందికి అందజేయాలని కోరారు.

## వేగం కంటే ప్రాణం ముఖ్యం: డీటీవో

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 14: వాహన వేగం కంటే ప్రాణాలు ముఖ్యమని జిల్లా రవాణాశాఖ అధికారి గౌస్‌పాషా అన్నారు. బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వాహనాల డ్రైవర్లు, యజమానులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రహదారుల మూలమలుపుల వద్ద పగటి సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అతి వేగంతో ప్రాణ నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రవాణా వాహనాల సామార్థ్యంకు మించిన స్థాయిలో అధిక లోడింగ్ చట్టరిత్యా నేరంగా పేర్కొన్నారు. ఎంవీఐ వీ వరప్రసాద్, సిబ్బంది సంతోష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీవో

వ్యవసాయ మార్కెట్‌కు

## సిబ్బంది కొరత

- ఖమ్మం మార్కెట్‌కు ఏటా పెరుగుతున్న పంట ఉత్పత్తుల రాక
- 49 మంది సిబ్బందికి 19 మందితో పని
- సిబ్బంది లేమితో అన్నదాతలకు, ఉద్యోగులకు నిత్యం ఇక్కట్లు



ఖమ్మం మిర్చి మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 14: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు పంట రావడం పెరుగుతున్నాకొద్ది మార్కెట్ సిబ్బందికి పని భారంతో పాటు ఒత్తిడి పెరుగుతుందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ మొత్తంగా 49 మంది ఎగ్జిక్యూటివ్ సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 19 మంది మాత్రమే ఉండటంతో వారిపై తీవ్ర పనిభారం పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఇతర జిల్లాల నుంచి పంట అమ్ముకునేందుకు వచ్చే రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. చాలీచాలని సిబ్బందితో రైతులకు కావాల్సిన ఏర్పాట్లను, సౌకర్యాలను సైతం మార్కెట్ సిబ్బంది అందించలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా మార్కెట్‌లో పనిచేసే కొంతమంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అధికారులకు చెప్పాపెట్టకుండా తమ డ్యూటీలకు దుమ్మా కొట్టడం సైతం మార్కెట్ కార్యకలాపాలు ఆలస్యమవడానికి కారణాలుగా ఉంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

**వేతనం పొందుతూ డ్యూటీ చేయని కొంతమంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది?**

మార్కెట్‌లో పర్మినెంట్ సిబ్బందితో పాటు సుమారు 35 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో కొంతమంది తమ డ్యూటీలకు అనధికారికంగా దుమ్మా కొడుతున్నారని విమర్శలు ఉన్నాయి. వారిలో నలుగురు సిబ్బంది నెల నెలా టంచనుగా వేతనాలు తీసుకుంటూ డ్యూటీలకు మాత్ర రావడంలేదని పలువరు ఉద్యోగులు పేర్కొం టుండటం విశేషం. మార్కెట్‌లో సిబ్బంది లేమితో ఇతర ఉద్యోగులకు పని భారం అవుతున్నా సదరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీరు మారక పోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్యూటీ చేయని ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎలా ఇస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా డ్యూటీకి దుమ్మాకొట్టే సదరు ఉద్యోగులకు తమ డ్యూటీలు ఏ యార్డులో ఉన్నాయో వారికే తెలియక పోవడంతో పాటు ఆయా సిబ్బంది పట్ల మార్కెట్ అధికారుల తీరుపై పలు అనుమానాలకు తావిస్తుంది. వ్యాపారులు కాంటాల సమయంలో ఏమైనా కొర్రీలు పెట్టినా, ధరలు తగ్గిస్తున్నా వారు ఫిర్యాదు చేయడానికి మార్కెట్ సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా మార్కెట్ కమిటీ పాలకవర్గం సైతం రద్దు కావడంతో రైతన్నలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు గత నెల రోజుల నుంచి పాలకవర్గం సైతం లేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి వరకు ఉన్న పాలక వర్గాన్ని రద్దు చేశారు. సెలెక్షన్ గ్రేడ్ హోదాలో ఉన్న మార్కెట్‌కు ఇప్పటి వరకు పూర్తి స్థాయి పాలకవర్గం అందుబాటులో లేకపోవడంతో కొంత మేర ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు పేర్కోంటున్నారు. మార్కెట్‌కు పత్తి, మిర్చి పంట సీజన్ ప్రారంభమవడంతో పంట ఉత్పత్తుల రాక క్రమేపీ పెరుగుతుండడంతో వెంటనే సిబ్బందిని నియమించాలని అన్నదాతలు కోరుతున్నారు.

**సరిపడా సిబ్బందిని వెంటనే నియమించాలి**

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు పంట ఉత్పత్తుల రాక పెరుగుతున్న నేపథ్యంలో అన్నదాతలకు ఇబ్బందులు కలుగకుండా మార్కెట్‌లో సరిపడే సిబ్బందిని వెంటనే నీయమించడానికి ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే మార్కెట్‌లో ఉద్యోగులు పనిభారంతో తీవ్రంగా ఒత్తిడికి గురౌవుతున్నారు. అలా ఒత్తిడికి గురైన ఉద్యోగులు అనారోగ్యం పాలైతే ఇంకా వేరే ఇబ్బందుల వస్తాయి. అధికారులు వెంటనే స్పందించి సిబ్బందిని తక్షణమే నియమించాలి.

● తాడేపల్లి కిరణ్‌కుమార్,
మార్కెట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

## సాగర్ ఆయకట్టులో యాసంగికి క్రాఫ్ హాలీడే

- జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి
- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి14: జిల్లాలోని సాగర్ ఆయకట్టులో వేసంగిలో క్రాప్‌హాలిడే పాటిస్తున్నట్లు ఖమ్మం కలెక్టర్ వీపీ. గౌతమ్ తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం మిషన్‌భగీరథ, పంచాయతీరాజ్, మునిసిపల్, నీటిపారుదల శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాగార్జునసాగర్ ప్రాజెక్టుపైనే జిల్లాలో సాగు, తాగునీటి సరఫరా ఆధారపడి ఉందని తెలిపారు. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లో నీరు లేనందున జిల్లాలో తాగునీటికి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని ఈసారి యాసంగికి క్రాప్ హాలిడే ప్రకటించినట్లు తెలిపారు. వేసవిలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. గ్రామస్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు లేనందున ప్రత్యేక అధికారులపైనే బాధ్యత అధికంగా ఉందన్నారు. వచ్చే మూడు నెలలు అత్యంత కీలకమైనవని, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏఈలు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో ఉండాలని, డీఈలు సంబంధిత మండలంలో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ నీళ్లు అందనిచోట ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. నీటి సరఫరాకు సబంధించి, చిన్నచిన్న మరమ్మతులు 15వ గ్రాంట్ కమిషన్ నిధులతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నీటి సరఫరా ఇబ్బందులు ఉన్నచోట ఓపెన్ వెల్, బోర్లు లీజుకు తీసుకునే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రగతిలో ఉన్న నీటిట్యాంకుల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలతో అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మిషన్‌భగీరథ ఎస్ఇ సదాశివకుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రమౌళి, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, నీటిపారుదల, తాగునీటి సరఫరా శాఖల ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయశాఖలో బదిలీలు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 14: వ్యవసాయశాఖలో బదిలీలపర్వం మొదలైంది. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఏడీఏలకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయాధికారికి బదిలీలు అయ్యాయి. జిల్లాలో వైరాలో పనిచేస్తున్న బి.బాబురావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయాధికారిగా, ఖమ్మం ఎఫ్‌టీసీలో పనిచేస్తున్న ఎం.సతీష్‌ను వైరా ఫుల్ అడిషనల్ చార్జి ఏడీఏగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యును మహబూబాబాద్ జిల్లా వ్యవసాయాధికారిగా బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

## మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

ఖమ్మంమార్కెట్, ఫిబ్రవరి 14: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 16 నుంచి 18 వరకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 శుక్రవారం నాడు కార్మిక సంఘాల జేఏసీ దేశ వ్యాప్త సమ్మె కారణంగా 17, 18 శని, ఆదివారాలు వారాంతపు సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. కాగా మార్కెట్‌లో ఈనెల 19న సోమవారం నుంచి అన్ని యార్డులలో క్రయవిక్రయాలు యథావిధిగా ఉంటాయని ఆయన తెలిపారు.

## 'నేడు ఉద్యోగార్థులకు నియామక పత్రాల అందజేత'

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి ఫిబ్రవరి14: బీసీ, ఎస్సీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖల్లో ఎంపికైన జూనియర్ లెక్చరర్లు, పీజీటిలు, లైబ్రరీయన్లు, ఫిజికల్ డైరెక్టర్లుగా ఎంపికైన 61 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదు గురువారం నియామక ఉత్తర్వులు అందుకోనున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఆమె అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వివిధ శాఖల్లో ఎంపికైన అభ్యర్థులను హైదరాబాద్ ఈ నెల 15వ తేదీన తీసుకెళ్లే అంశంపై అధికారులతో ఆమె చర్చించి వారికి ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖలో 34 మంది, ఎస్సీ సంక్షేమ శాఖలో 11మంది, గిరిజన సంక్షేమ శాఖలో 12మంది, మైనార్టీ శాఖలో 4గురికి గురువారం నియామక ఉత్తర్వులు అందజేస్తారని అన్నారు. ఎంపికైన అభ్యర్థులు నియామక పత్రాలను సీఎం చేతుల మీదుగా అందుకొని తిరిగి క్షేమంగా ఇంటికి తిరిగి చేర్చాల్సిన బాధ్యత తమదేనని అన్నారు.

## భద్రాద్రి దేవస్థానం ఈవో బదిలీ నిలిపివేత!

భద్రాచలం ఫిబ్రవరి 14: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి బదిలీ ఆగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రెండు రోజుల క్రితం భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవిని కీసర ఆర్డీవో గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈవోగా రమాదేవి బాధ్యతలు నిర్వహిస్తున్న గత ఏడాది కాలంలో భద్రాద్రి దేవస్థానం లోని అన్ని విభాగాలను ప్రక్షాళన చేయడమే కాకుండా దేవస్థానం ఆదాయం భారీ ఎత్తున పెరగడంలో ఎంతో కీలకపాత్ర వహించారు. ఈ క్రమంలో ఈవోని యధాప్రకారం ఈవోగా కొనసాగించాలని రామ భక్తులు, భద్రాద్రి వాసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతులు ఒత్తిళ్ల క్రమంలో ఈవో బదిలీ ఆగినట్లు ప్రచారం సాగుతోంది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు సైతం వెలువడనున్నట్లు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# కొత్తగూడెంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్

**ఓ మునిసిపల్ కౌన్సిలర్‌తోపాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు కాంగ్రెస్‌లో చేరిక**

కొత్తగూడెం టౌన్/వైరా, ఫిబ్రవరి 14: కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్‌తోపాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే కొత్తగూడెం మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అసమ్మతి బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు ఇచ్చిన క్రమంలో తాజాగా బీఆర్ఎస్‌కు చెందిన 20మంది కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడం జిల్లాలో సంచలనం కలిగించింది. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కౌన్సిలర్ పల్లప లక్ష్మణ్, కౌన్సిలర్ కాసుల ఉమారాణి భర్త కాసుల వెంకట్, బీమా శ్రీవల్లి భర్త బీమా శ్రీధర్, మోరె రూప భర్త మోరె రమేష్, ఖమ్మంపాటి దుర్గాప్రసాద్, అబ్దుల్ మున్నిసాబేగం భర్త అబ్దుల్ రజాక్, రావి మమత భర్త రావి రాంబాబు, విమల భర్త కొండస్వామి, మాదా సత్యవతి భర్త శ్రీరాములు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మునిసిపల్ కౌన్సిలర్లు పల్లప లక్ష్మణ్, తంగెళ్ల లక్ష్మణ్, నాయకులు బీమా శ్రీధర్, మసూద్, రజాక్, కాసుల వెంకట్, కంభంపాటి దుర్గాప్రసాద్, మోరె రమేష్, రావి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



భట్టి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహన తనిఖీలో పాల్గొన్న ఏఎస్పీ పరితోజ్ పంకజ్

భద్రాచలం, ఫిబ్రవరి 14: మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నియమాలు పాటించకుండా ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు ఉంటాయని భద్రాచలం ఎఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. భద్రాచలంలోని బ్రిడ్జి రోడ్డులో నిర్వహించిన వాహన తనిఖీల్లోభద్రాచలం ఎఎస్పీ పరితోష్ పంకజ్ పాల్గొని పలు వాహనాలు సీజ్ చేయడంతో పాటు నిబంధనలు సరిగా పాటించని వారికి ఫైన్ విధించారు. అలాగే నెంబరు ప్లేట్ లేని వాహనాలకు అక్కడికక్కడే నెంబరు ప్లేట్లను అమర్చారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామని వాహనచోదకులను హెచ్చరించారు. అలాగే ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ నెంబరు లేకుండా వాహనం నడిపినా నెంబరు ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే ఇకపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోతే మృతునిపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డునపడతాయని హెచ్చరించారు.

# సమయం పాటించని ఉపాధ్యాయులు.. విద్యార్థుల అవస్థలు

కరకగూడెం, ఫిబ్రవరి 14: ఉపాధ్యాయులు సమయం పాటించక పోవడంతో విద్యార్థుల చదువులు చట్టుబండలవుతున్నాయి. 9:30 గంటల సమయానికి ఉపాధ్యాయులు పాఠశాలకు రావాలి సాయంత్రం 4 గంటలకు వెళ్లాల్సిన ఉపాధ్యాయులు తమ ఇష్టానుసారంగా పాఠశాలలకు వస్తు పోతున్నారు. మండలంలోని పద్మాపురం పంచాయితీ మొగిలితోగు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 9:30 గంటలకు రావల్సిన ఉపాధ్యాయులు 10 గంటలు దాటిన పాఠశాలకు రాలేదు. పాఠశాలకు రాలేదని గ్రామస్తులను ఆరా తీయగా ఇల్లందు నుంచి వస్తున్నట్లు తెలిపారు. దీంతో విద్యార్థులు ఆటపాటల్లో మునిగితేలారు.

## కానిస్టేబుల్‌గా ఎంపికైన ప్రశాంత్‌కు సత్కారం



ప్రశాంత్‌ను సత్కరిస్తున్న యువకులు

దమ్మపేట, ఫిబ్రవరి, 14: అంకంపాలెం గ్రామానికి చెందిన కూరం ప్రశాంత్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యాడు. దీంతో ఆగ్రామానికి చెందిన ఆదివాసి యువకులు, స్నేహితులు కలిసి ప్రశాంత్‌ను బుధవారం సత్కరించి అభినందించారు. భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో కల్పించిన ఉచిత శిక్షణతో తాను కానిస్టేబుల్‌కు ఎంపికైనట్లు ప్రశాంత్ తెలిపాడు. తనకు శిక్షణ కలిపించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు. ప్రశాంత్ తండ్రి కూరం దారయ్య అదే గ్రామంలో గిరిజన గురుకుల కళాశాలలో కుక్‌గా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రశాంత్‌కు అభినందనలు తెలిపారు. ప్రశాంత్‌ను అభినందించిన వారిలో కాకా రమేష్, కోంద్రు రవి, శ్రావణ్, కూరం నగేష్, నరిసింహారావు, పైదా బాలు, వెంకటేష్, పోతురాజు, దీలిప్, సాయి, చరణ్, రాజేంద్ర, ధర్మరాజు, రాము, జయంత్, సతీష్ తదితరులున్నారు.

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు: ఆర్సీవో



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్సీవో ప్రత్యూష

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 14: గురుకులాల్లో విద్యార్థులపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణలో ఉండకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆర్సీవో కె.ప్రత్యూష హెచ్చరించారు. బుధవారం అన్నపురెడ్డిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సమస్యలు, ఉపాధ్యాయుల పనితీరుపై ఆమె ఆరా తీశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉన్నతులుగా మారాలని సూచించారు. ఇష్టపడి చదివితే రానిదేదీ ఉండదని అన్నారు. విద్యార్థులు ఉన్నతులుగా మారి తల్లిదండ్రులకు పేరు తేవాలని కోరారు. విద్యార్థుల క్రమశిక్షణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

## రేణుకకు రాజ్యసభ పట్ల సంబురాలు



కేక్ తినిపిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 14: ఏఐసీసీ నాయకురాలు రేణుకచౌదరికి రాజ్యసభ సీటును ఇవ్వడంపట్ల అశ్వారావుపేటలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బుధవారం పట్టణంలోని సుంకవల్లి వీరభద్రరావు గృహంలో కేక్‌ను కట్ చేసారు. మిఠాయిలు పంచారు. సీనియర్ నాయకులు జేస్ట సత్యనారాయణ చౌదరి కేక్ కట్‌చేసి అభిమానులకు తినిపించారు. రేణుక చౌదరి జై అంటూ నినాదాలు చేసారు. రాజ్యసభ సీటు ఇవ్వడం ఆమెకు కాంగ్రెస్‌లో దక్కిన అపూర్వమైన గౌరవమని, పార్లమెంట్ ఎన్నికలలో కూడ కాంగ్రెస్ సత్తా చాటుతామని నినాదాలు ఇచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ విజయం అప్రహహితమని నినాదాలు చేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, జేస్ట సత్యనారాయణ చౌదరి, కట్రం స్వామి, నార్లపాటి శ్రీను, కాసాని మురళి, నార్లపాటి రాములు, ఆలపాటి రామమోహనరావు పాల్గొన్నారు.

## భారత్ బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు




మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 14: ఈ నెల 16న నిర్వహించనున్న గ్రామీణ భారత్‌బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. ములకపాడు పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సమ్మె జయప్రదానికి రాజకీయ పార్టీలు, కార్మిక, కర్షక సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం కార్పొరేటర్లకు కొమ్ము కాస్తూ- అన్ని వర్గాల ప్రజలనూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కారం పుల్లయ్య, వై.వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, వై.శ్రీనివాస్, కృష్ణ, చంటి తదితరులు పాల్గొన్నారు.

**మేడారం జాతర రద్దీ నేపథ్యంలో...**

## రోడ్లపై ఆక్రమణలు తొలగించాలి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 14: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర నేపథ్యంలో మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారిని ఆక్రమించిన చిరువ్యాపారులు వెంటనే తమ ఆక్రమణలను తొలగించాలని సీఐ రమాకాంత్, మున్సిపాలిటీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం పోలీస్, మునిసిపల్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నెలకొల్పిన వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి ఆయా చిరు వ్యాపారులకు నేరుగా ఆదేశాలు జారీ చేశారు. రహదరి వెంట ఉన్న షాపుల యజమానులు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన షాపు పబ్లిసిటీ బోర్డులను వెంటనే తొలగించాలని హెచ్చరించారు. లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చిరు వ్యాపారులు వెంటనే ఆక్రమణలను తొలగించి అధికారులకు సహకరించాలని కోరారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జవాన్‌ల సేవలు చిరస్మరణీయం

చర్ల, ఫిబ్రవరి 14: పుల్వామా ఉగ్రదాడిలో చనిపోయిన 40 మంది జవాన్ల సేవలు చిరస్మరణీయమని చర్ల సీఐ ఆలెం రాజువర్మ అన్నారు. ఉగ్రదాడిలో చనిపోయిన జవాన్లకు బుధవారం చర్ల పోలీస్ స్టేషన్‌లో ఘననివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజువర్మ మాట్లాడుతూ, దేశ రక్షణలో జవాన్ల పాత్ర చాలా కీలకమన్నారు. ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కోని జవాన్లు బోర్డర్‌లో విధులు నిర్వహిస్తారని తెలిపారు. అలాంటి రక్షకులపై దాడి చేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. యువత కూడా దేశ రక్షణలో బాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చర్ల గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు పోలీస్ స్టేషన్ ఆవరణలో నృత్యాలు, దేశ భక్తి పాటలను పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో చర్ల ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి, గురుదేవ్ విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు హెచ్‌జీవీ ప్రసాద్ ఇతరులు ఉన్నారు. అలాగే పదోతరగతి విద్యార్థులకు చర్ల ఎస్సై టీవీఆర్ సూరి స్టేషనరీ అందజేశారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

## సామూహిక అక్షరాభ్యాసం

మణుగూరు, ఫిబ్రవరి 14: మణుగూరు మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో, దేవాలయాల్లో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని గుట్ట మల్లారం గ్రామంలోని పంచముఖ వేద గాయత్రీ దేవి అమ్మ వారి ఆలయంలో దయానిధి అకినేపల్లి వసంతచార్యులు అమ్మ వారి ఆశీసులతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చే సి నట్లు తెలిపారు. పలువురు చిన్నారుల చేత ఆయలంలో అక్షరాభ్యాసాన్ని చేయించారు. అశోక్ నగర్‌లో సాయి బాబా ఆలయంలోని విఘ్నేశ్వరుడ ఆలయ మండపంలో సనాతన హిందూ ధర్మ పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలకు ముఖ్య అతిధులుగా మణుగూరు తహశీల్దార్ రాఘవ రెడ్డి, మణుగూరు డీఎస్పీ ఎస్వీ రాఘవేందర్ రావు పాల్గొన్నారు. గిరిశర్మ పంతులు ఆధ్వర్యంలో చదువుల తల్లి సరస్వతి దేవి అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మండపంలో చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఆలయ నిర్వహణ బాధ్యులు, సనాతన హిందూ ధర్మ పరిరిక్షణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఈవీఎంల పరిశీలన అత్యంత ప్రధానం: కలెక్టర్

కొత్తగూడెం, ఫిబ్రవరి 14: ఎన్నికల ప్రక్రియలో ఈవీఎం మొదటి దశ పరిశీలను అత్యంత ప్రధానమని కలెక్టర్ ప్రియాంక అన్నారు. బుధవారం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు, మొదటి దశ పరిశీలన చేశారు. అనంతరం ఈవీఎం గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు ఎన్నికల సంఘం కేటాయించిన 1588 బ్యాలెట్ యూనిట్‌లు, 1424 కంట్రోల్ యూనిట్లు, 1683 వీవీ ప్యాట్‌లు మొదటి దశ పరిశీలన చేపట్టామన్నారు. గురువారం వరకు పరిశీలన మొత్తం పూర్తవుతుందన్నారు. అనంతరం ఈవీఎం కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు, ఈవీఎం గోదాములో భద్రపరచనున్నట్లు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈవీఎం పరిశీలన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలనలో ఈసీఐఎల్ కు చెందిన సాంకేతిక నిపుణుల బృందం ఈవీఎంల పనితీరును పరిశీలించడం జరుగుతుందన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ప్రియాంక అల

## పెనుబల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చుంచుపల్లి, ఫిబ్రవరి14: చుంచుపల్లి మండలం పెనుబల్లి పంచాయతీలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక రైతు వేల్పుల మల్లేష్, ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కన్నుల పండువగా జరిగింది. ప్రతిష్ఠ మహోత్సవాలను అర్చకులు రమణ బృందం వారిచే నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహా సభ అధ్యక్షులు చిలకర వెంకటనర్సయ్య, యోజన అధ్యక్షులు సిత్తారి సింహాద్రి యాదవ్, డిసిఎమ్ఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, డైరెక్టర్ మల్లిబాబుయాదవ్, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీరహన్మంతరావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములుయాదవ్, ప్రముఖ న్యాయవాది జివికె.మనోహర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ వేల్పుల దామోదర్‌యాదవ్, విగ్రహ ప్రతిష్ఠ కుటుంబ సభ్యులు ఝెప్పుల రాజేందర్‌కుమార్, స్థానికులు ఉదయ్‌కుమార్, నాగరాజుయాదవ్, సాయిముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టిని పరామర్శించిన మద్దెల

చుంచుపల్లి, ఫిబ్రవరి14: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అభ్యుదయ కళాసమతి అధ్యక్షుడు, తెలంగాణ బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ మద్దెల శివకుమార్ బుధవారం పరామర్శించారు. డిప్యూటీ సీఎం సోదరుడు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం మల్లు కుటుంబ సభ్యులతో ఉన్న తన అనుబంధాన్ని గుర్తు చేసుకొని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సింగరేణి జీఎం ఆనందరావు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆంథోటి పాల్, చుంచుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆంథోటిపాల్, రాజు, నరేందర్, మందా హన్మంత్ ఉన్నారు.

## ఆధార్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 14: ఆధార్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తరింప చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని యానంబైలు గ్రామంలో బుధవారం సీఎస్‌సీ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. మండలంలో ఎక్కువగా ఏజెన్సీ గ్రామాలే ఉన్నాయని అన్నారు. మండల కేంద్రానికి రావాలంటే సుమారు 30 కి.మీ ప్రయాణం చేసి గిరిజన ప్రాంతాల నుంచి ప్రజలు ఆధార్, ఇతర ఆన్‌లైన్ సేవల విషయంలో మండల కేంద్రానికి రావాల్సి వస్తుంది అన్నారు. మారుమూల గ్రామాల్లో ఎక్కువగా సీఎస్‌సీ సెంటర్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, పాన్ కార్డు, ఓటర్ కార్డ్ పీఎం విశ్వకర్మ శ్రీనివాసరెడ్డి, డీఎం మధుసూదన్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్స్ బుడగం రామ్‌మోహన్ రావు, యర్రంశెట్టి మధు, బుడగం కిరణ్, వాసం మంగయ్య, కందుకూరి రాము, దారా చిరంజీవి తదితరులు ఉన్నారు.

## మునిసిపల్ కమిషనర్‌గా శేషాంజనేయస్వామి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 14: కొత్తగూడెం మునిసిపల్ కమిషనర్‌గా శేషాంజనేయస్వామిని నియమిస్తూ పురపాలకశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగూడెం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రఘును రంగారెడ్డి జిల్లా బదాంగ్‌పేటకు బదిలీ చేయగా పరకాల మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శేషాంజనేయస్వామిని నియమించారు.

## మణుగూరు ఎస్‌డీపీవోగా రవీందర్‌రెడ్డి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 14: మణుగూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్‌గా వి.రవీందర్‌రెడ్డి బదిలీపై రానున్నారు. ప్రస్తుతం ఎస్‌డీపీవోగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్వీ రాఘవేంద్రను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు బుధవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మణుగూరు సబ్ డివిజన్‌లోని అశ్వాపురం మండలంలో గతంలో ఎస్ఐగా విధులు నిర్వహించిన వి.రవీందర్‌రెడ్డికి మణుగూరు సబ్‌డివిజన్‌లో లా అండ్ ఆర్డర్ నిర్వహణపై అనుభవముంది.

## షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు, ఫిబ్రవరి 14: వేసవి సమీపిస్తున్న క్రమంలో పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలన్నింటిలో షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని మాచినేనిపేటతండా నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలను సేకరించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన 24 నర్సరీలలో 2.64 లక్షల మొక్కలను హరితహారం క్రింద పెంచుతున్నట్లు తెలిపారు. వేసవిలో ఎండల తీవ్రతకు మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని, తరచూ నీటి తడులను అందించాలని ఆయన కోరారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రవి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

## పంటల నమోదు పరిశీలన

ములకలపల్లి, ఫిబ్రవరి, 14: జగన్నాధపురం పంచాయతీ పరిధిలోని చింతపేట గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు బుధవారం పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులందరు తాము సాగు చేసిన పంట వివరాలను వ్యవసాయాధికారులకు తెలపాలని రైతులను కోరారు. పంట నష్టం జరిగినప్పుడు పంట నమోదు చేసారా లేదా పరిశీలించటం జరుగుతుందనానరు. ప్రస్తుతం రైతులు సాగు వివరాలను ఇవ్వాలని కోరారు. ఆయన వెంట టెక్నికల్ అధికార సాయినారాయణ, ఎంఏవో ఎ కరుణామయి, ఏఈవో రమేష్ రైతులు పాల్గొన్నారు.

## సమ్మెకు దూరంగా ఉండండి

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 14: సింగరేణి కాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియాలో ఈ నెల 16న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఒక్క రోజు టోకెన్ సమ్మెకు సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు దూరంగా ఉండాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంత్సరం దగ్గర పడుతున్న క్రమంలో ఉత్పత్తి లక్ష్యాలు సాధించే దిశగా సింగరేణి సంస్థ వెళుతోందన్నారు. ఈ తరుణంలో సమ్మెల వలన ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఏ డిమాండ్లతో ఒక్క రోజు సమ్మెకు కార్మిక సంఘాలు పోతున్నాయో అవి సింగరేణి సంస్థ పరిధిలోని కావని, సంస్థ పరిష్కరించే సమస్యలు కూడా కావన్నారు. సంస్థ పరిధిలోని సమస్యలు ఏమైన ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉండేదని, ఈ డిమాండ్లు కేంద్ర ప్రభుత్వ పరిధిలో పరిష్కరించాల్సిన సమస్యలన్నారు. విజ్ఞత కలిగిన సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు వాస్తవాన్ని గ్రహించి సమ్మెకు దూరంగా ఉండాలని జీఎం విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 14: మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం శంఖుస్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.4లక్షలతో చేపట్టిన మారాయిగూడెం గ్రావెల్ రహదారి నిర్మాణంతోపాటు మారాయిగూడెం సమ్మక్క-సారలమ్మ గుడి అభివృద్ధి పనులను ప్రారంభించారు. కొత్తపల్లి ఆశ్రమపాఠశాలలో మొక్కలను నాటిన అనంతరం గ్రామంలో ఎల్‌బీసీ నిధులు, దాతల ఆర్థిక సాయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. ఎంపీటీసీ ధర్మరాజు, మాజీ ప్రజాప్రతినిధులు వెంకటేశ్వరావు, అపకా వీర్రాజు, పెద్దలు వీరభద్రం, ఆదినారాయణ, శ్రీను, వెంకటేశ్వరావు, బీఆర్ఎస్ కార్యదర్శి కణితి రాముడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 14: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తహశీల్దార్, పేరాయిగూడెం గ్రామ పంచాయతీ ప్రతేక అధికారి వి.కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు, బుధవారం పేరాయిగూడెం గ్రామ పంచాయతీలో ప్రతేక పారిశుధ్య వారోత్సవాలో భాగంగా యువతకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలను ప్రత్యేక అధికారి వి.కృష్ణ ప్రాసాద్, ముఖ్య అతిది అయిన ఎంపీడీవో శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం తహశీల్దార్ వి.కృష్ణప్రాసాద్ మాట్లాడారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన పాత పేరాయిగూడెం జట్టుకు రూ.1,116లు, ద్వితీయ బహుమతి సాధించిన నెహ్రూనగర్ జట్టుకు రూ.516లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాదర్శి కోటమర్తి శ్రీరామ్‌మూర్తి పాల్గొన్నారు.

## వన దేవతల జాతర ప్రారంభం



పుట్టబంగారాన్ని తీసుకొస్తున్న పూజారులు, ఆదివాసీలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 14: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో వన దేవతలైన సమ్మక్క - సారలమ్మ జాతర కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. తొలి రోజు పూజారులు వనం నుంచి పుట్ట బంగారాన్ని మేళతాళాల మధ్య తీసుకొని వచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. పూజారులు ప్రత్యేక పూజలను చేశారు. సాయంత్రం వనం నుంచి సారలమ్మ అమ్మ వారిని తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మ వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్ము నృత్యాలతో అలరించారు.

## యువత సమాజాభివృద్ధికి కృషిచేయాలి

అశ్వాపురం, ఫిబ్రవరి 14: యువత సమాజాభివృద్ధికి తమవంతు కృషిచేయాలని తహశీల్ధార్ స్వర్ణ అన్నారు. పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని మొండికుంట క్రీడా ప్రాగణంలో యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన తహశీల్ధార్ మాట్లాడుతూ యువత మత్తుకు బానిస కావొద్దన్నారు. క్రీడలతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.